ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 29 అక్టోబరు 2025

అజ్ఞాతం వీడిన చంద్రన్న



- ఆయుధాలు లేకుండానే రాష్ట్ర డీజీపీ ఎదుటకు..
- 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి
- దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ వరకు ...
- అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ఇంటి ముఖం చూడని చంద్రన్న

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగుబాట పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం జూలపల్లి మండలం వడుకాపూర్ చెందిన పుల్లూరి ప్రసాదరావు (65) అలియాస్ చంద్రన్న అలియాస్ శంకరన్న లొంగిపోయారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. అనంతరం మావోయిస్టు పార్టీలో చేరి దళసభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. ఉద్యమ బాట పట్టిన ఆయన ఏనాడూ ఇంటి ముఖం చూడలేదు. 45 ఏళ్ల అజ్ఞాతం వీడి ఆయుధాలు పార్టీకి అప్పగించి రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయారు. అనారోగ్య సమస్యలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు లొంగిపోయానని తెలిపారు. సిర్పూర్, చెన్నూర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కుర్సంగి మోతీబాయి అలియాస్ రాధక్కను చంద్రన్న వివాహం చేసుకున్నారు. ఆమె లొంగిపోయిన అనంతరం నిర్మల్ ప్రాంతంలోని స్వగ్రామంలో ఉంటున్నారు.



హైదరాబాద్‌లో చంద్రన్న

⑥

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/జూలపల్లి)

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటి వరకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులకు వంద శాతం ప్రారంభించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్లపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కింగ్ పూర్తి చేసిన లబ్ధిదారులంతా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. బేస్‌మెంట్ స్థాయికి చేరుకునేలా హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు, కార్యదర్శులు పర్యవేక్షించాలని అన్నారు. లబ్ధిదారులకు పెట్టుబడి సమస్య ఉంటే మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించాలని, ఇళ్లు నిర్మించుకోవడంలో అలసత్వం వహిస్తే ఇండ్లు రద్దు చేయాలన్నారు జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఓ వీర బుచ్చయ్య, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సీఆర్‌పీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాకు కేటాయించిన వరంగల్ సీనియర్ సీఆర్‌పీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వరంగల్ మహా సమాఖ్య ఆధ్వర్యంలో 8 మంది సీనియర్ సీఆర్‌పీలచే 13 మండలాల్లో 15 మండల సమాఖ్యలకు, 12 గ్రామ సమాఖ్యలకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్డిఓ కాళిందని, అదనపు డిఆర్డిఓ బి రవీందర్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు మేలు



రైతువేదికలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని, కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి భక్తి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లి రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా పత్తి రైతులు యాప్‌లో నమోదు, తేమ శాతం ఎంత ఉండాలనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పత్తి రైతులు తమ వివరాలతోపాటు సాగుకు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ లేకుండా ఉంటుందని, తేమ శాతం ఆధారంగా సీసీఐ ధర చెల్లిస్తుందన్నారు. ఏడిఏ శ్రీనాథ్, మండల వ్యవసాయధికారిణి అలివేణి, ఏఈవోలు పాల్గొన్నారు.

పోలీసు అమరుల సేవలు అజరామరం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల అజరామరమని ప్రతీ ఒక్కరు వారి సేవలను స్మరించుకోవాలని డీసీపీ కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీలు గజ్జి కృష్ణ, రమేష్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమై, ప్రధాన వీధుల గుండా సాగుతూ బేగంపేట చౌరస్తా వరకు కొనసాగించారు. డీసీపీ మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు మరిచి పోలేనివన్నారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు వెంకటేష్, సనత్‌రెడ్డి, మధుకర్, రమేష్ గౌడ్, పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ నోడల్ అధికారి తనిఖీ



విద్యార్థులను ప్రశ్నిస్తున్న నోడల్ అధికారి కల్పన

ముత్తారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన మంగళవారం ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల హాజరు శాతం తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యతను పరీక్షించేలా పలు ప్రశ్నలను అడిగారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీవోలు

పెద్దపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాకు కేటాయించిన ముగ్గురు ఎంపీడీవోలు మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రూప్ 1 ఫలితాలలో 509 ర్యాంకు సాధించిన కరీంనగర్‌కు చెందిన కంకణాల శ్రీజారెడ్డి, జగిత్యాలకు చెందిన వేముల సుమలత 609 ర్యాంకు, సాదినేని ప్రియాంక 446 ర్యాంకు సాధించారు. వీరిని జిల్లాకు కేటాయించడంతో కంకణాల శ్రీజారెడ్డి మంథని, వేముల సుమలత అంతర్గాం, సాదినేని ప్రియాంక కమాన్‌పూర్ ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందించారు. జడ్పీ సీఈవో నరేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పంటను పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం పంట కొనుగోలుపై కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతంలో ఎప్పుడు వరి కోతలు జరుగుతాయో షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలన్నారు. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వరి కోతలు చేయవద్దని రైతులకు సూచించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను రైస్‌మిల్లులకు ట్యాగ్ చేసుకోవాలని, వంద శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామగ్రి అందుబాటులో పెట్టాలని, హమాలీల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా కొనుగోలు చేసిన ధాన్యం సంబంధిత ట్రక్ షీట్స్ ఎప్పటికప్పుడు జనరేట్ చేయాలని, మిల్లులకు తరలించాలని, రైతులకు డబ్బులు జమ చేయాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు తరలించాలని, జిల్లాలో ఎక్కడ రైస్ మిల్లు వద్ద కటింగ్స్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకొన్న గ్రామస్థులు



ఇసుక ట్రాక్టర్లను నిలిపివేసిన గ్రామస్థులు

మంథనిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం గ్రామంలో ఇళ్ల మధ్యలో నుంచి ఇసుక ట్రాక్టర్ల వెళుతుండడంతో మంగళవారం గ్రామస్థులు అడ్డుకొన్నారు. గ్రామ శివారులోని గోదావరి నది నుంచి ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రాక్టర్లు ఇళ్ల మధ్య నుంచి వెళుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో గ్రామస్థులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇళ్ల మధ్య రోడ్డు ఇరుకుగా ఉండటంతో పిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ కోతల సమయం కావడంతో పిల్లలను ఇంటి వద్దనే ఉంచి వెళుతామని, ఆకస్మాత్తుగా రోడ్డుపైకి వస్తే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక రవాణా కోసం దెబ్బతిన్న గోదావరికి వెళ్లే రహదారికి మరమ్మతులు చేసి ఇళ్ల మధ్యలో నుంచి ఇసుక ట్రాక్టర్ల రవాణా నిలిపి వేయాలని మాజీ ఉపసర్పంచి కోరవేన రవి, గ్రామస్థులు కోరుతున్నారు.

కార్తీక మాసం సందర్భంగా పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ఖని ఆర్‌టీసీ డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. నవంబర్ 4న యాదగిరి గుట్ట, స్వర్ణగిరి, కొలనుపాక ఒక రోజు ప్రత్యేక ప్యాకేజీకి పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.800, 6న, 19న రెండు రోజుల ప్యాకేజీలో భాగంగా శ్రీశైలంకు పెద్దలకు రూ.2200, పిల్లలకు రూ.1800గా పేర్కొన్నారు. నవంబర్ 11న 6రోజుల ప్యాకేజీలో భాగంగా పలని, పాతాళశంభు, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, జోగులాంబ ఆలయాలకు పెద్దలకు రూ.8000, పిల్లలకు రూ.6000, ఐదు రోజుల ప్యాకేజీలో నవంబర్ 23న రాంటెక్, ప్రయాగరాజ్, వారణాసి, అయోధ్య, ఫైహార్, చాంద మహంకాళిలకు పెద్దలకు రూ.6600, పిల్లలకు రూ.5000 చార్జీలుగా నిర్ణయించినట్టు చెప్పారు. త్వరలో తిరుపతి, పూరి, కుకి సుబ్రహ్మణ్యస్వామి, షిర్డి పుణ్యక్షేత్రాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక యాత్ర ప్యాకేజీలో భాగంగా 35మంది కంటే ఎక్కువగా ఉంటే కోరిన చోటకు బస్సును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 7013504982, 7382847596, 797989847927, 9908138036 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్ల పై పశువులను వదిలితే జరిమానా

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని రోడ్లపై ఎవరైనా పశువులను వదిలిపెడితే జరిమానా విధిస్తామని కమిషనర్ ఎస్.మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ల మీద పశువులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుంచి పశువులను రోడ్ల మీద వదిలి పెట్టే యజమానులకు పది వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పశువుల యజమానులు తమ పశువులను ఇంటి ఆవరణలో కట్టి వేసుకోవాలని సూచించారు.

'మల్టీపర్పస్'తో కారోబార్‌ల కష్టాలు

- జీవో 51తో ఉనికిని కోల్పోతున్న జీపీ సిబ్బంది
- రికార్డులు రాసిన చేతితో పారిశుధ్య పనులు
- పాత పద్ధతినే కొనసాగించాలని వేడుకోలు



భోజన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న కారోబార్‌లు గత ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం తీసుకురావడంతో ఉనికిని కోల్పోయే స్థితికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు రాసి సిబ్బందితో పనులు చేయించే కారోబార్‌లు జీవో 51తో తట్ట, పార పట్టుకోవాల్సిన స్థితికి చేరుకున్నారు. పెద్దపల్లి మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉండగా ఒకే గ్రామంలో బిల్ కలెక్టర్ ఉన్నారు. 29 గ్రామ పంచాయతీల్లో కారోబార్‌లుగా విధులు చేపడుతూ మల్టీపర్పస్ విధానంలోనే ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. మల్టీపర్పస్ విధానం ద్వారా వారికి ఇచ్చేది కేవలం రూ.9500 వేతనం మాత్రమే. ఈ వేతనం మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి వస్తాయి. దీంతో కారోబార్‌ల పరిస్థితి దిగజారడంతో పాటు కుటుంబ పోషణ భారంగా మారిందని కారోబార్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారోబార్‌లు ఉన్నత చదువులు చదివి ఉండగా పారిశుధ్య పనులు మినహాయించి పంచాయతీ బాధ్యతలు అప్పగించే నిర్దేశిత జాబ్‌చార్ట్‌ను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కారోబార్‌లను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరుతున్నారు. ప్రతి నెల గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

● ఉద్యోగానికి తగ్గ వేతనాలు కరువు

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్‌లకు ఉద్యోగానికి తగ్గట్టుగా వేతనాలు సరిగా లేని పరిస్థితి ఉంది. నిత్యం ప్రజల మధ్య ఉండే కారోబార్‌లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలకు, గ్రామ, మండల స్థాయి అధికారులకు వారధిగా ఉంటున్నారు. పెద్దపల్లి మండల వ్యాప్తంగా 30 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 29 గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్‌లను కారోబార్‌లుగా వినియోగించుకోగా రాఘవపూర్‌లో బిల్ కలెక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కారోబార్‌లకు పనిభారం ఎక్కువగా ఉందని ఆవేదన చెందుతున్నారు.

● నిత్యం ప్రజల్లోనే కారోబార్‌లు

గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా సమస్యలు, ధ్రువీకరణ పత్రాలు, పంచాయతీకి సంబంధించిన లావాదేవీలతోపాటు కార్యదర్శులు గ్రామాలకు చేరుకునే సరికి సిబ్బందిని కారోబార్‌లు సమన్వయం చేస్తూ పారిశుధ్య పనులు చేయిస్తుంటారు. గ్రామంలో ఎక్కడ సమస్య ఉన్నా సిబ్బందితో పనులు చేయించే కారోబార్‌లు ఇప్పుడు వీధుల్లో ఏ సమస్య ఉన్న దగ్గరుండి ప్రజా సేవ చేస్తున్నారు. వీధి దీపాలు పోతే వేయించడం, మురికి కాలువలను శుభ్రం చేయించడం, దోమల నివారణకు ఫాగింగ్, ఇంటి పన్నులు వసూలు చేయడం పనులను కారోబార్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రధానంగా గ్రామంలో నీటి సరఫరా, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందించడంలో కారోబార్‌ల పాత్ర కీలకంగా ఉంది. మల్టీపర్పస్ విధానంతో అన్ని పనులు వారే చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగికి లేని నిబంధనలు వారికి వర్తింపజేయడంతో కారోబార్‌ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఏళ్ల తరబడి పని చేస్తున్నా కారోబార్‌లను ప్రభుత్వం గుర్తించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వారు కోరుతున్నారు.

● కారోబార్‌లను ప్రభుత్వం గుర్తించాలి

- బందరి అశోక్, కారోబార్, కనగర్తి



గ్రామ పంచాయతీల్లో నిత్యం ప్రజల సమస్యలు, పారిశుధ్య చేయించే కారోబార్‌లను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలి. ప్రభుత్వం జీవో 51ని రద్దు చేయాలి. అందులో నుంచి కారోబార్‌లను మినహాయించి పాతపద్ధతిని కొనసాగించాలి. కారోబార్‌లకు వర్క్ చార్ట్ అందించాలి. సిబ్బందికి ప్రతినెల గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఎరవెల్లి ముత్యంరావు, సీఐటీయూ గౌరవాధ్యక్షులు, తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటియూ)



బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో తెచ్చిన 51 జీవో మల్టీపర్పస్ విధానం మూలంగా కారోబార్‌లు మానసిక క్షోభకు గురవుతున్నారు. జీవో నెంబర్ 51ని వెంటనే సవరించాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తే కారోబార్‌లకు , జీపీ సిబ్బందికి న్యాయం జరుగుతుంది. రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాం, అయినా స్పందించని పరిస్థితి ఉంది. రద్దు చేయకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

వృద్ధురాలి ఆత్మహత్య


వీరలక్ష్మి (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో సిరిపురం వీరలక్ష్మి (70) అనే వృద్ధురాలు మంగళవారం ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. వీరలక్ష్మి పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడం, నడవలేని స్థితిలో ఉండటంతో జీవితంపై విరక్తి చెందింది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో తలుపులు, దర్వాజాలకు ఉపయోగించే రంగులను కడగటానికి తెచ్చిన పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు వీరశంకర్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

- 5 వాహనాలు సీజ్, రూ. 60వేల జరిమానా


రేణికుంట టోల్‌గేట్ వద్ద ఆర్టీఏ అధికారుల వాహన తనిఖీలు

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 5 వాహనాలను సీజ్ చేసి 1 బస్సుకు జరిమానా విధించారు. ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద రాజీవ్ రహదారితో పాటు చొప్పదండి ప్రాంతాల్లో ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదారాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్‌లో నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించారు. అంతేకాకుండా టాక్సులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌తో పాటు ఇతర ధ్రువపత్రాలు లేని రెండు ట్రాక్టర్లు, రెండు లైట్ గూడ్స్ వాహనాలు, ఒక కారు మొత్తం ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐ హరిత సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి?

● ఐఎఫ్‌ఎమ్‌ఐఎస్ యాప్ వల్ల ఉపయోగాలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఉపయోగించుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సివి జీవన్‌రాజు తెలిపారు. అక్టోబర్ పెన్షన్లు యథావిధిగా జమ అవు తాయి. ఈ విషయంలో పెన్షనర్లు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఐఎఫ్‌ఎంఐఎస్ యాప్ గురించి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) యాప్‌లో పెన్షనర్లు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వంలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల పేర్లు, హోదా, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయని వారి జీతాలు అక్టోబరు నుంచి నిలిపి వేయాల్సిందిగా ఆర్థిక శాఖ నుంచి ట్రెజరీ డైరెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఇది కేవలం ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది.

● ఐఎఫ్‌ఎంఐఎస్ వల్ల ఉపయోగాలు

ఇది జీతాలు, పెన్షన్లు తదితర వాటి చెల్లింపులను వేగవంతం చేస్తుంది. చెల్లింపుల్లో పారదర్శకత ఉంటుంది. ఐఎఫ్‌ఎమ్‌ఐ యాప్ ద్వారా తమకు వచ్చే పెన్షన్ పే స్లిప్పులను, సవివరంగా, సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాక దీనిలోని ప్రొఫైల్ ద్వారా మన వ్యక్తిగత కుటుంబ వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నవి తెలుసుకోవచ్చు. ఈ యాప్ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ వంటి సేవలను అందిస్తుంది. ప్రభుత్వం ఆర్థిక నిర్వహణ ప్రక్రియ ఆటోమేట్ చేయడానికి, ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగించే కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ. రాష్ట్రంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు తదితరాలు అన్ని దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.



● ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఐఎఫ్‌ఎమ్‌ఐఎస్ పెన్షనర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎనిమిది అంకెల పీపీవో ఐడితో లాగిన్ అవ్వాలి. సెల్‌ఫోన్‌కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయగానే మన పేరు వస్తుంది. దాని కింద రెండు గదులు ఉంటాయి. దానిలో నాలుగు అంకెల పాస్‌వర్డ్ నింపి సబ్‌మిట్ చేయాలి. నెల వారీగా మనం తీసుకుంటున్న పదేళ్ల వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన ఎడమవైపు ఆకుపచ్చ రంగుల వ్యూ ప్రొఫైల్ అని ఉంటుంది. దానిలో స్పౌజ్ పేరు, పుట్టిన తేది, బ్యాంక్ అకౌంట్ నెంబర్ వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన కుడివైపు లోగో పక్కన మూడు అడ్డగీతలు ఉంటాయి. వాటిని తాకితే తొమ్మిది రకాల ఐఎఫ్‌ఎమ్‌ఐఎస్ సేవలు వస్తాయి. అందులో ముఖ్యమైనవి, పెన్షన్ పేస్లిప్, లైఫ్ సర్టిఫికేషన్ తాకితే వీడియో రికార్డింగ్ ద్వారా మనం ప్రతీ సంవత్సరం నవంబరు నుంచి మార్చి వరకు ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్ నేరుగా మన ట్రెజరీ అధికారులకు ఇవ్వవచ్చు. ఈ లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా డిజిటల్‌లో ఇవ్వవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే మొబైల్ నంబర్ 9849204085కు సంప్రదించాలని తెలిపారు.

బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

● కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లతో పాటు అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే మహిళలు వేధింపులు, లైంగిక దాడులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్‌గా పనిచేస్తున్న గీసుకొండ మండలం శాయంపేటకు చెందిన మహ్మద్ యాకూబ్ పాషా(30) మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని మంగళవారం రేకుర్తిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా చైల్డ్, మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సదరు పాఠశాలలో విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై బీఎన్ఎస్ పోక్సో ఐటీ చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్యను హింసిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామానికి చెందిన సత్తినేని కరుణాకర్ నిత్యం మద్యం తాగుతూ కటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. రోజూ తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. గత నెల 15న కరుణాకర్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను విపరీతంగా కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు నిందితుడిని అరెస్టు చేశారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం పెరగడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సోమవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,154 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,000 క్యూసె క్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. కాగా ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 886.509 టీఎంసీ నీరు రాగా, 818.796 టీఎంసీల నీరును వదిలారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భక్తుల టాటాఏస్ వాహనం, రుద్రంగి చెందిన కారు చందుర్తి మండలం లింగంపేట-మల్యాల గ్రామాల మధ్య వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ నడుపుతున్న కథలాపూర్ మండలం కలికోట గ్రామం చెందిన డ్రైవర్ రాజుకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం కాగా, రుద్రంగి చెందిన లచ్చవ్వ, లక్ష్మి, దేవలక్ష్మి, రత్నమ్మలకు తలకు, కాళ్లకు గాయాలైనట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పంగా గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చందుర్తి రుద్రంగి చెందిన 108అంబులెన్స్‌లో పైలెట్లు నరేందర్, చాణక్య ఈఎంటి గణేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని వేములవాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

బీఎస్సీ, హానర్స్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడదల

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 1,2,3వ సెమిస్టర్, బయో మెడికల్ సైన్స్ కోర్సుల్లో 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. పరీక్షలు నవంబర్‌లో ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, 300 రూపాయల అపరాధ రుసుముతో 10వ తేదీలోగా అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

గుడిసె దగ్ధం


దగ్ధమైన వస్తువులు

గంభీరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో గుగులోత్ రాజునాయక్‌కు చెందిన గుడిసె దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.90వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా బాధితుడికి సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు.

ఒకరిపై దాడి కేసు నమోదు

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన గోగుల మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో గల రూ. 50వేల నగదుతో పాటు టీవీ ధ్వంసం చేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అజ్ఞాతం వీడిన చంద్రన్న

- ఆయుధాలు లేకుండానే రాష్ట్ర డీజీపీ ఎదుటకు
- 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి
- దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ప్రస్థానం
- అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ఇంటి ముఖం చూడని చంద్రన్న

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/జూలపల్లి)

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగుబాట పడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ కీలక నేత పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ, అభయ్ 62 మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో లొంగిపోయారు. మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట జిల్లాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు (65) అలియాస్ చంద్రన్న అలియాస్ శంకరన్న 45 ఏళ్ల అజ్ఞాతం వీడి ఆయుధాలు పార్టీకి అప్పగించి లొంగిపోయారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బేనని చెప్పవచ్చు. ప్రసాదరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 లక్షల రూపాయల రివార్డును అందజేశారు.

● ఆర్ఎస్‌యూ నుంచి అజ్ఞాతంలోకి..

జూలపల్లి మండలం వడుకాపూర్ చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న 45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. 1961లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా ప్రసాదరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు అశోక్ రావు, తిరుపతి రావు, ఒక సోదరి ఉన్నారు. ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు రామగుండంలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు మరణించగా గ్రామంలో సొంత ఇల్లు శిథిలావస్థకు చేరి నేలమట్టమైంది. ప్రసాదరావు వడుకాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి చదివారు. 1979లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్‌గా వ్యవహరించిన దగ్గు రాజలింగుతో చంద్రన్నకు పరిచయం ఏర్పడింది. రాజలింగు విప్లవ బోధనలతో ప్రభావితుడైన చంద్రన్న ఆర్ఎస్‌యూలో చేరి విప్లవ పంథా వైపు అడుగులు వేశారు.

● కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ..

1980లో ఇంటర్ పూర్తి చేసిన చంద్రన్న మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కేఎస్ గ్రూపు నాయకుల మధ్య సమాచారాన్ని చేరవేసే వారు. సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్ మరో నేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ మీసాల రాజిరెడ్డి దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఆయన నేతృత్వంలోని సాయధ దళంలో చేరారు. చంద్రన్నతో పాటు మరో ఇద్దరిని 1980 జూలైలో ఛత్తీస్ గడ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. జగ్దల్‌పూర్ జైలులో ఉన్న చంద్రన్న అదే సంవత్సరం డిసెంబరులో బయటకు వచ్చి ఇంటికి చేరారు. తర్వాత కొద్ది రోజులకే అజ్ఞాతంలోకి వెళ్లి ఆసిఫాబాద్ దళంలో సభ్యుడిగా పనిచేశారు. 1981లో పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత సిర్పూర్ దళ కమాండర్‌గా 1983లో బాధ్యత లు చేపట్టారు. 1987 వరకు దళ కమాండర్‌గా పనిచేసిన ఆయన డివిజనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతల్లో సిర్పూర్, చెన్నూరు ప్రాంత దళాల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రన్న 1995లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించిన ఈ కమిటీలో చంద్రన్నతో పాటు జినుగు నర్సింహరెడ్డి అలియాస్ జంపన్న, సందె రాజమౌళి అలియాస్ ప్రసాద్‌లు సభ్యులుగా పనిచేశారు. 2006 వరకు కమిటీలో చంద్రన్నతోపాటు ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన చంద్రన్న 2007లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.



పుల్లూరి ప్రసాదరావు చదువుకున్న వడుకాపూర్ ప్రభుత్వ పాఠశాల


పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న(ఫైల్)

● 2008 నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా..

కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా వ్యవహరించిన చంద్రన్న 2008లో పూర్తి స్థాయిలో సీసీ కమిటీ సభ్యుడిగా చేరారు. 2021 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణించడంతో ఆ బాధ్యతలను చంద్రన్న చేపట్టారు. 2024 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు బడే దామోదర్ అలియాస్ చొక్కారావుకు అప్పగించిన తరువాత సీసీ మెంబర్‌గా చంద్రన్న తెలంగాణ కమిటీకి మార్గదర్శిగా వ్యవహరించారు. చంద్రన్న 1989లో సిర్పూర్, చెన్నూర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కుర్సంగి మోతిబాయి అలియాస్ రాధక్కను వివాహం చేసుకున్నారు. 2013 జూన్‌లో రాధక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరెస్టు కాగా 2015లో బెయిల్‌పై వచ్చిన తరువాత నిర్మల్ ప్రాంతంలోని వారి స్వగ్రామంలో నివాసం ఉంటున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ప్రసాదరావు ఇంటి ముఖం చూడలేదు. 17 ఏళ్లకు పైగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన చంద్రన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. అనారోగ్య సమస్యలు కూడా వెంటాడుతుండడంతో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు.

పార్టీలో కొనసాగుతున్నది వీరే...

మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రామగుండం ప్రాంతానికి చెందిన డీసీఎం అప్పాసి నారాయణ అలియాస్ రమేష్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన రాష్ట్ర కమిటీ మెంబర్ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ గంగిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, పాలితం గ్రామానికి చెందిన డివిజన్ కమిటీ మెంబర్ ఆలేటి రామలచ్చులు అలియాస్ రాయలచ్చులు, ఏరియా కమిటీ మెంబర్లు దాతు ఐలయ్య, వడ్కాపూర్ చెందిన ఢీకొండ శంకరయ్య అలియాస్ శేషన్న, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్ రావు అలియాస్ దర్మన్నలు పార్టీలో కొనసాగుతున్నారు.

మాది లొంగుబాటు కాదు..
- పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్న

'మాది లొంగుబాటు కాదు అభివృద్ధిలో కలిసి పనిచేయడానికి వచ్చాం. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశాను, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తాను. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరి తరం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'మా భావజాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నాను. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని ఎన్నుకున్నారు. దేవ్‌జీని సపోర్ట్ చేస్తున్నాను. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చాను.' అని ఆయన వెల్లడించారు. మావోయిస్టులు మా అన్నదమ్ములని సీఎం రేవంత్ పిలుపునివ్వడంతో ముందుకు వచ్చామని, జనంలో ఉంటూ జనం కోసం పని చేస్తామన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య


వెంకటరాజం(ఫైల్)

ధర్మారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల వెంకటరాజం (67) అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్లుగా నాటుసారాకు అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో వెంకటరాజం మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి సోమ వారం తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. వెంకటరాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సిమ్స్‌లో చోరీ

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) జనరల్ ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చోరీలు జరుగుతున్నాయి. పేషెంట్లుగా ఆసుపత్రికి వచ్చి మొబైల్స్ ఎత్తుకెళుతున్న రామగుండం చెందిన వెంకటేష్‌ను మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి కడుపునొప్పి అంటూ ఆసుపత్రిలో చేరిన వెంకటేష్ అతనికి ట్రీట్‌మెంట్‌లో కేర్ టేకర్‌గా ఉన్న రాజేష్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. అతని కదలికలు గమనించిన సెక్యూరిటీ సిబ్బంది రాజేష్ థియేటర్ కల్లు కాంపౌండ్ వద్ద మంగళవారం ఉదయం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. జీఎం కాలనీకి చెందిన మదన్మోహన్ అనే వ్యక్తి రవీందర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో అతడిని కూడా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా అతని మతిస్థిమితం సరిగా లేదని, అతను తన బైక్ అని మరో బైక్ తీసుకెళ్లినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

రాచపల్లిలో దొంగల హల్‌చల్

ఇల్లందకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు పలు ఇళ్లలో హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రికార్డు గది, ఆఫీస్ రూమ్‌లో చిందర వందర చేశారు. గ్రామంలోని సెలూన్ షాపులోని వస్తువులను కూడా పడేశారు. అదే విధంగా రెండు ఇళ్లలోని వస్తువులను కూడా చిందర వందర చేశారు. కాగా దొంగతనానికి వచ్చిన వ్యక్తి నల్ల సంచిలో డాక్యుమెంట్ పేపర్లు క్లాస్‌రూమ్‌లో మరిచి వెళ్లారు. ఎల్లమ్మ గుడిలో వస్తువులను చిందరగా పడేశారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాచపల్లిలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు కేశవపట్నం ఏఎస్ఐ సంపత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా వాటిని గుర్తించి పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను బాధితులైన చెంచాల శ్రీనివాస్, బుర్ర రవి, తోట అరవింద్‌లకు అందజేసినట్లు తెలిపారు. కాగా ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వాటి వివరాలను వెంటనే మిస్సింగ్ మొబైల్ సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేయడం ద్వారా మొబైల్ గుర్తించవచ్చన్నారు. దీంతో తిరిగి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడానికి అవకాశం ఉంటుందన్నారు.



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఏఎస్ఐ సంపత్‌రెడ్డి

బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా మారిన బద్దిపోచమ్మ ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన కళ్లసాక పెట్టి చల్లంగా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు చర్యలు తీసుకున్నారు.

భక్తులకు అందుబాటులో ప్రసాదాల కౌంటర్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా ప్రసాదాల కేంద్రాలను భీమశ్వర ఆలయం వద్దకు తరలించారు. నెల రోజులుగా భీమన్న ఆలయం ముందు వేద పాఠశాలలో కౌంటర్ నిర్మాణాలను చేపట్టారు. రాజన్న ప్రసాద విక్రయాల కౌంటర్ పనులు పూర్తి కావడంతో రెండు కౌంటర్‌లను సోమవారం భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

అంజన్న క్షేత్రంలో భక్తుల పూజలు



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మల్యాల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం వేలాదిగా భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

వేములవాడలో శరవేగంగా బ్రిడ్జి పనులు



వేములవాడ మూలవాగుపై వేగంగా జరుగుతున్న బ్రిడ్జి పనులు



14 మీటర్ల లోతుకు పిల్లర్లు వేసేందుకు యంత్రాలతో జరుగుతున్న పనులు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం
- భక్తులకు తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ తిప్పలు తప్పేలా నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వేములవాడ మూలవాగుపై అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ. 28 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 సంవత్సరం వరకు రెండు వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి వుంది. ఎడమ వైపు మొదటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినప్పటికీ కుడివైపు బ్రిడ్జి నిర్మాణ దశలోనే కూలి పోయింది. బ్రిడ్జి నిర్మాణం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండటంతో పాటు రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించడంతో వేగంగా ముందుకు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం 190 మీటర్ల పొడవుతో మూలవాగుపై నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ఐదు స్లాబ్‌లు ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే ఇప్పటి వరకు రెండు స్లాబ్‌లు పూర్తి అయినప్పటికీ మూడు స్లాబ్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. తిప్పాపూర్ బస్టాండు సమీపంలో మొదటి స్లాబ్, అమరవీరుల స్థూపం వద్ద చివరి స్లాబ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల కోసం యంత్రాలతో 14 మీటర్ల లోతుతో ఫైల్స్ చేయడంలో కాంట్రాక్టర్ నిమగ్నమై ఉన్నారు. వచ్చే వర్షాకాలం వరకు భక్తులకు, పట్టణవాసులకు బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

● నిర్మాణ దశలోనే కూలిన బ్రిడ్జి

గతంలో మూలవాగుపై కుడివైపు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ దశలోనే పలు మార్లు కూలిపోయింది. యేటా వర్షకాలం వస్తే చాలు బ్రిడ్జి కూలడం లేదా కుంగడం జరిగింది. రూ. 28 కోట్ల నిధులలో భూసేకరణ కోసం రూ. 7 కోట్లు సేకరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో భారీ వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేసినట్లు కాంట్రాక్టర్‌లు ఆర్భాటం చేశారు. ఒక బ్రిడ్జి పనులు పూర్తి అయినా అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని 2018లో కాంట్రాక్టర్ నిరసన తెలిపాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత శాఖ మంత్రి సహకారంతో పనులు జరిగేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. భూసేకరణ చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో కాంట్రాక్టర్‌లు పనుల్లో వేగం పెంచారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7 వేలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 115 మంది రైతులు 1,140 క్వింటాళ్ల విడిపత్తి, 22 మంది రైతులు 34క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఐదు మంది రైతుల నుంచి 51క్వింటాళ్ల పత్తి మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ఐఐటీ మద్రాస్ నుంచి జంగపల్లి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఐటి మద్రాస్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డాటా సైన్స్ ఏఐ కోర్సు పూర్తి చేసి జంగపల్లి విద్యార్థులకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందాయి. ఎనిమిది వారాల ఆన్‌లైన్ స్కూల్ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శివసాయి, హాసిని నవలిక, భవాని, వర్షిణిలకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శారద ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి మద్రాస్ నుంచి సర్టిఫికెట్‌లను అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గైడ్ చేసిన టీచర్ వసుంధర, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కొలనూరులో కొండచిలువ



కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొలనూరు గ్రామంలో కొంతసేపు కొండ చిలువ హల్‌చల్ చేసింది. కొలనూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మం గళవారం రాత్రి కొండ చిలువ రావడంతో గ్రామ స్థులు భయాందోళన గురయ్యారు. దీంతో గ్రామస్థులు కొండచిలువను హతమార్చారు.

రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదు

- 1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ నవంబరు 1న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 23 రోజుల క్రితం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేస్తే ఇంతవరకు అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలో దళితులపై దాడులు జరిగితే వారికి రాజ్యాంగం, చట్టాలు సమానంగా పనిచేయడంలేదని ఆరోపించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కావడాన్ని అగ్రవర్ణాల వారు జీర్ణించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించినాటి నుంచి సుప్రీం కోర్టులో ఎస్సీ రిజర్వేషన్ అమలు కాలేదని, గవాయి బాధ్యతులు స్వీకరించిన తరువాత రిజర్వేషన్ అమలు చేశారని, దీనిని కూడా అగ్రవర్ణాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. బీఆర్ గవాయి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మహారాష్ట్రలో అంబేద్కర్ గ్రామానికి వెళ్తే ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీ స్వాగతం పలకాలని, కానీ వారు రాలేదని, ఆనాడు వారిపై చర్యలు తీసుకుంటే ఈ దాడి జరిగేది కాదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చింది కూడా గవాయి అని, వర్గీకరణను వ్యతిరేకించేవారు కూడా ఈ ఘటనను ఖండించడం లేదని అన్నారు. దాడి జరిగిన తరువాత ఢిల్లీ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే 24 గంటల్లో స్పందించిన మానవహక్కుల కమిషన్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే ఇంతవరకు స్పందించలేదని, సుమోటోగా కేసు స్వీకరించలేదని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, బోయిని కొమురయ్య, బక్కి మురళీకృష్ణ, చెంచాల నవీన్, కొత్తూరి రాజన్న, తడగొండ శంకర్, చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయాలి

- లైంగిక వేధింపుల్లో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ఐదు రోజులుగా విచారణ జరిపారుపుతున్నారన్నారు. లైంగిక వేధింపుల విషయంలో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు.

వారి పాత్ర ఉన్నట్లు తేలితే పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దని ఇప్పటికే అధికారులకు చెప్పామన్నారు. లైంగిక వేధింపుల బాధ్యుడితో పాటు, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేశారన్నారు. పిల్లలకు భరోసా ఇవ్వడంతో పాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా అధికారులు భరోసా కల్పిస్తున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. నిర్బంధ విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితి తెలుసుకుని అందుకు అను గుణంగా బోధించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా పరిస్థితి మారలేదన్నారు. ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను గాలికి వదిలి వేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాలకు భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయక చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశామన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ఆంధ్రప్రదేశ్‌లోని19జిల్లాల్లో వర్షం ప్రభావం భారీగా ఉన్నందున ఇప్పటికే ఆ రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పంపించామన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందున ఆయా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రం తరుపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కొనుగోలు కేంద్రానికి స్థలం ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లిలో రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

చిగురుమామిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి గ్రామంలో స్థలం ఏర్పాటు చేయాలని బొమ్మనపల్లిలో గ్రామ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో హుజూరాబాద్- హుస్నాబాద్‌కు వెళ్లే వాహనాలు నిలిచిపోయి రవాణాకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ భూమి కేటాయించాలని యేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మద్దసాని రమేష్, ఎస్సై సాయికృష్ణ గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడారు. స్థలాన్ని పరిశీలించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందించన్నుట్లు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతు ఐక్య వేదిక నాయకులు, అన్ని పార్టీల గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూమి చదును చేస్తుండగా పురాతన నాణేలు లభ్యం

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం చీమలపేటలో ఇంటి స్థలాన్ని చదును చేస్తుండగా లభించిన పురాతన కాలం నాటి 10 నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాణేలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలపేటకు చెందిన తొంటి రాజు అతని 7 గుంటల ఇంటి స్థలాన్ని ఈ నెల 25న ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా పురాతన కాలం నాటి 10 నాణాలు బయట పడ్డాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే జూలపల్లి ఎస్ఐ రెవెన్యూ అధికారులతో విచారణ జరిపారని, రాజు వద్ద ఉన్న 10 నాణేలు గుర్తించి నగల తయారీ వ్యక్తి వద్ద పరీక్షించారన్నారు. అవి వెండి, రాగి, ఇత్తడి లోహాలతో తయారు చేసిన నాణాలుగా నిర్ధారించారని తెలిపారు. నిర్ధారించిన నాణాలు 111.50 గ్రాముల బరువు ఉన్నాయని, వాటిని పురావస్తు శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పురాతన వస్తువులు, నాణేలు లభిస్తే సంబంధిత అధికారులకు అప్పజెప్పాలని, వాటిని అక్రమంగా దాచుకోవడం నేరమన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పిచ్చికుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కొల్లేరు హనుమన్లు, మాసం నర్సయ్యపై కుక్క దాడి చేసింది. నిజామాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ మామిడిపల్లికి బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో ఆమెను కూడా గాయపరిచింది. మరిమడ్ల గ్రామానికి చెందిన నరసయ్య కూడా పిచ్చికుక్క దాడిలో గాయపడ్డాడు. వీరందరికీ కోనరావుపేటలో ప్రభుత్వ దవాఖానాలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ చికిత్స అందించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సహకరించండి

- ఎన్నికల అధికారి, డీసీవో మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు సాఫీగా సాగేందుకు డైరెక్టర్లుగా పోటీచేస్తున్న అభ్యర్థులు, సభ్యులు, బ్యాంక్ సిబ్బంది సహకారం అందించాలని ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్.మనోజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ బ్యాంకు ప్రధానశాఖ కార్యాలయంలో పాలకవర్గ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.శివ నాగేందర్‌రెడ్డి, కె.వంశీకృష్ణ, ఎ.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఫిర్యాదు

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన నూనె పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తూ ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా విచారణ జరిపి నిజనిర్ధారణ జరిగాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తాను ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

రొట్టమాకురేవు కవిత్వ అవార్డులకు కవుల ఎంపిక

త్వరలో అవార్డుల ప్రదాన సభ

కారేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండు సంవత్సరాలుగా తన తండ్రి షేక్ మహమ్మద్ మియా స్మృత్యర్థం కవులను కవిత్వ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని, ఈ ఏడాది కూడా కవుల ఎంపిక జరిగిందని, త్వరలోనే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు ప్రముఖ కవి షేక్ యాకుబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 నుంచి 2024వరకు వెలువడిన కవితాసంపుటుల నుంచి నాలుగు కవితాసంపుటులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందన్నారు.

వాటిలో సిరిసిల్లకు చెందిన నాగిళ్ల రమేష్ రచించిన వల్లకొడిసె వన్నెకాడు, హైదరబాద్‌కు చెందిన జూపాక సభద్ర రచించిన తెలంగాణీ కైతల దొంతులు, మహబూబాబాద్‌కు చెందిన రహిమొద్దీన్ రచించిన కలలరంగు, ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటి గింజలు కవితా సంపుటిలను ఎంపికయ్యాయన్నారు. వారికి తన తండ్రి షేక్ మహమ్మద్ మియా, తన గురుసమానులైన మాజీ ఎమ్మెల్యే కేఎల్ నరసింహారావు, తన మామ పురిటిపాటి రామిరెడ్డి పేరిట ఈ వార్డులను అందజేయనున్నామని, త్వరలోనే ఈ కార్యక్రమం వివరాలు వెల్లడిస్తామని యాకూబ్ తన ప్రకటనలో తెలిపారు.



రొట్టమాకురేవు కవిత్వ అవార్డుల బ్రోచర్

ఆన్‌లైన్ తప్పులను సవరించాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఓదెల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎల్‌ఆర్‌యూపీ (ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం) భూముల పట్టాలపై విచారణ నిర్వహించాలని మంగళవారం తహసీల్దార్ ధీరజ్‌కుమార్‌కు రైతులు గుండేటి ఐలయ్య, కామని శ్రీనివాస్, మధునయ్య, కరుణాకర్ రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయ భూములు ఆన్‌లైన్ చేసే సమయంలో భూములను తప్పుగా రికార్డుల్లో నమోదు చేశారని తెలిపారు. తప్పుగా నమోదైన భూముల యజమానుల వివరాలు సవరించేందుకు అవకాశం కల్పించకపోవడంతో రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌యూపీ సమయంలో జరిగిన తప్పిదంతో రైతులకు పంట రుణాలు, రైతుభరోసా అందడం లేదని, ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రికార్డుల్లో, భూముల నమోదులో తలెత్తిన సమస్యలను, ఆర్‌ఓఆర్ సమస్యలను పరిష్కారించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్



అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్ విద్యార్థులకు ఆత్మరక్షణ, మాదక ద్రవ్యాలు, షీటీమ్‌పై అవగాహన కల్పించారు. సీఐ-2 రవీందర్ విద్యార్థులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్, షీటీమ్‌పై విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్, బీజేపీ అన్యాయం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

సుల్తానాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడంలో కాంగ్రెస్, బీజేపీ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నవంబరు 1న చేపట్టనున్న ధర్నా పోస్టర్లను మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడంలో ఆ పార్టీలు విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వాలు బీసీలపై కపట ప్రేమ చూపుతూ, మోసపూరిత జీవోలను తెస్తూ మభ్యపెడుతున్నాయన్నారు. పార్లమెంట్‌లో చట్టసవరణ చేసి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బీజేపీ బీసీ వ్యతిరేక విధానాలను అవలంబించడం శోచనీయమన్నారు. గొట్టే రాజు, బొంకూరి దుర్గయ్య, సాతురి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని లయన్స్ భవన్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్నవారికి షుగర్, ఇతర పరీక్షలు చేసి కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ కజాంపురం రాజేందర్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఎంతో మంది పేదలకు ఉచిత కంటి చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్లప్ప, ఉపాధ్యాయులు పోకల ఆంజనేయులు, కార్యదర్శి ముడతనపల్లి సారయ్య, కోశాధికారి రాజేంద్రకుమార్, రేకుర్తి ఆసుపత్రి వైద్యులు, సీనియర్ లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో మై భారత్ జిల్లా స్థాయి క్రీడలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మై భారత్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 31 నుంచి నవంబరు 1 వరకు నిర్వహించే పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, చెస్ క్రీడలు ఉంటాయని, అభ్యర్థులు 15 నుంచి 29 ఏళ్ల పురుషులు, మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పేర్లను ఆర్గనైజర్లు రేషవేణి మహేష్ 7993604489, రాకేష్ 7780674425, వేగోళం రిషి 9390559514, కర్నాకర్ రెడ్డి 9908133143 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉషు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రీయ ఉషు చాంపియన్‌షిప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పెద్దపల్లి జిల్లా తరుపున అండర్ 12, 14, 17 విభాగాల్లో సాండా ఫైటింగ్‌లో సిగిరి శ్రావ్యంజలి బంగారు పతకం, యాసర్ల అరుషి, వెండి, బూడిద ఉదంతిక, కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను పెద్దపల్లి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ కుమార్, తెలంగాణ ప్రెసిడెంట్ ఉమర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ అభినందించారు.

ఎల్‌వోసీ అందజేత

మంథనిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంజపడుగు గ్రామానికి చెందిన కొప్పుల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం మంజూరైన రెండు లక్షల యాభై వేల రూపాయల విలువైన ఎల్‌వోసీని మంగళవారం అందజేశారు. నిమ్స్ ఆసుపత్రిలో శ్రీనివాస్ చికిత్స పొందుతుండగా సహాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబుకు దృష్టికి తీసుకెళ్లి ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ

రామగిరి/ముత్తారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని డీసీపీ కరుణాకర్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం ముత్తారం-రామగిరి మండలాల్లో పోలీస్ ఉన్నతాధికారులు సైకిల్‌యాత్రను చేపట్టారు. ముత్తారం మండలం కాల్వశ్రీరాంపూర్ నుంచి రామగిరి వరకు డీసీపీ, ఏసీపీ కృష్ణ, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు సైకిల్ యాత్రను చేపట్టారు. రామగిరి పోలీస్‌స్టేషన్ చేరుకున్న సైకిల్ యాత్ర అనంతరం డీసీపీ మాట్లాడారు. ప్రజల సహకారంతోనే పోలీసులు ముందుకు వెళ్తారని పేర్కొన్నారు. ప్రజల కోసమే పోలీస్‌లు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో గోదావరిఖని డివిజన్ పరిధిలోని పోలీసులు, యువకులు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రతో రామగిరికి చేరుకున్న పోలీస్ అధికారులు

కాల్వశ్రీరాంపూర్ నుంచి బేగంపేట మీదుగా ఇదులాపూర్, ముత్తారం మండలంలోని పోతారం, సర్వారం, లక్కారం, మచ్చుపేటల మీదుగా సైకిల్ ర్యాలీ జరిగింది. ముత్తారం ఎస్ఐ రవి కుమార్ ఆధ్వర్యంలో యువకులు ఇదులాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ర్యాలీలో పాల్గొన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మంథని సీఐ రాజు గౌడ్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, మంథని ఎస్ఐ సాగర్, కమాన్‌పూర్ ఎస్ఐ కొట్టే ప్రసాద్, మహిళా పోలీసులు సౌజన్య, ప్రత్యూష, శ్వేత పాల్గొన్నారు.

రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాటన్ కార్పొరేషన్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని మార్కెట్ చైర్మన్ వైనాల రాజు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపల్లిలోని పరమేశ్వర కాటన్ పరిశ్రమలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం 8 శాతం తేమతో రూ.8110 మద్దతు ధరను ప్రకటించిందన్నారు. కాపాస్ యాప్‌లో ముందుగా బుకింగ్ చేసుకోవాలన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులు ప్రభుత్వం కల్పించే మద్దతు ధరకు పత్తి పంటను అమ్ముకునే వెసలుబాటు ఉంటుందన్నారు. కౌలు రైతులు మండల వ్యవసాయ అధికారి నుండి ధ్రువీక రణ పత్రం పొందాలని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీలు రాంచంద్రం గౌడ్, తోట చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు రవీందర్, ఆకుల ఓదెలు, శిలారపు అనిత మల్లయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ముత్తారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మండల రాజమల్లు ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాయకులు తాండ్ర మల్లేష్, లక్కం ప్రభాకర్, మండల రవీందర్, మూగ రవీందర్, తోడేటి శశికుమార్, దామమదన్, పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే లొంగిపోయా..

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండల కేంద్రానికి చెందిన పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న అలియాస్ జగన్ మంగళవారం రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయాడు. ఆయన మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితులలో ఉన్నందున బయటకు వచ్చానే తప్ప పార్టీని వ్యతిరేకించి కాదన్నారు. తాను ఆయుధాన్ని వదిలేశానే తప్ప పార్టీ లైను కాదని, మావోయిస్టు ఉద్యమం కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిరుపతి అలియాస్ దేవ్‌జీ నాయకత్వంలో నడుస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, డీజీపీ పిలుపు మేరకు ప్రజాస్రవంతిలో కలిసి ప్రజల కోసం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఎక్కడ తన ఉనికిని, ఫొటోలు బయటకు రానివ్వకుండా 45 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న చంద్రన్న యేడాది క్రితం తండ్రి చనిపోయినా కడసారి చూపునకు రాలేదు.

పంటలను పరిశీలించిన ఏవో

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదివారంపేట్‌లో పొలాలను మండల వ్యవసాయా అధికారి చిందం శ్రీకాంత్ సందర్శించారు. వరిలో కంకినల్లి, అగ్గితెగులు సోకడాన్ని గమనించారు. కంకినల్లి వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. ఏఈవో నవీన్, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా చర్యలు

పశువైద్యాధికారి అఖిల్‌రాజ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాగినేడు పశువైద్యాధికారి అఖిల్ రాజ్ అన్నారు. మండల వ్యాప్తంగా గాలికుంటు టీకాల శిబిరాలపై వివరించారు.

ఆంధ్రజ్యోతి: మండల వ్యాప్తంగా ఎన్ని పశువులు ఉన్నాయి ?ఎంతవరకు టీకాలు పూర్తయ్యాయి ?

పశువైద్యాధికారి: 30 గ్రామాల్లో 9800 పశువులు ఉన్నాయి. ఇప్పటివరకు 23శాతం వరకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో టీకాలు వేశారు ?

పశువైద్యాధికారి: రాఘవపూర్, నిట్టూరు, దేవునిపల్లి,అందుగులపల్లి, కొత్తపల్లి, మూలసాల, సబ్బితం, పెద్దకల్వల గ్రామాల్లోని పశువులకు టీకాలు వేశాం. మిగతా గ్రామాల్లో సైతం త్వరలోనే పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: గాలికుంటు వ్యాధి వల్ల కలిగే నష్టాలు ?

పశువైద్యాధికారి: పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగిస్తుంది. టీకాలు వేయడం ద్వారా వ్యాధిని అరికట్టవచ్చు.

ఆంధ్రజ్యోతి: టీకాల వల్ల కలిగే లాభాలు ?

పశువైద్యాధికారి: పశువులకు టీకాలు వేయించడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. పశువులలో గుండె సమస్యలు, దూడల మరణాలు, ఇతర వ్యాధుల నివారణ ఖర్చులను తగ్గిస్తుంది.

- పెద్దపల్లి రూరల్

వైద్యులను అభినందించిన డీసీహెచ్

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): అత్యవసర చికిత్సను అందించి తల్లి, బాబు ప్రాణాలను కాపాడిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది డీసీహెచ్ డాక్టర్ కె శ్రీధర్ మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ జూలపల్లి మండలం వెంకటరావుపల్లి గ్రామానికి చెందిన గర్భిణీ లావణ్య బీపీ ఎక్కువగా ఉండడంతో ఈ నెల 6వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పించారని తెలిపారు. బీపీ కంట్రోల్ కాకపోవడంతో 7వ తేదీన సర్జరీ చేశారన్నారు. బాబు 1.30 కిలోల బరువుతో జన్మించారని, శ్వాసకు సంబంధించిన ఇబ్బంది ఉండడంతో సీ ప్యాప్ మెషిన్ ద్వారా రెండు రోజులు కృత్రిమ శ్వాస అందించామని తెలిపారు. క్రమంగా నాజల్ ద్వారా శ్వాస అందించగా కోలుకున్నాడని, బాబు బరువు 1.512 కిలోలకు పెరిగాడని తెలిపారు. మంగళవారం డిశ్చార్జీ చేశామన్నారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, సపోర్టింగ్ సిబ్బంది ఆయన అభినందించారు.



వైద్యులను, సిబ్బందిని అభినందిస్తున్న డీసీహెచ్ శ్రీధర్

గ్రామశాఖ యూత్ కమిటీ ఎన్నిక

ముత్తారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామ కాంగ్రెస్ యూత్ గ్రామశాఖ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూస సంపత్, ఉపాధ్యక్షుడిగా ఎగుర్ల రాజు, జనరల్ సెక్రటరీగా జంగపల్లి విజయ్, కార్యదర్శిగా అడూరి శ్రీకాంత్, అధికార ప్రతినిధిగా చేనవేన ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. వారికి మండల యూత్ అధ్యక్షుడు బక్కతట్ల వినిత్ నియామక పత్రాలను అందించారు. మాజీ ఎన్ఎస్‌యూఐ జిల్లా జనరల్ సెక్రటరీ చేనవేన సాయికుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు చేనవేన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అణువుల రాజేందర్, సీనియర్ నాయకులు ప్రకాష్ రెడ్డి, యారా రాజయ్య, ఏగుర్ల కుమార్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో ముందుండాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న గుమ్ముళ్ల సత్యం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధిలో ముందుండాలని విశ్వహిందు పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్ముళ్ల సత్యంజీ అన్నారు. మంగళవారం శారదానగర్‌లోని విశ్వహిందు పరిషత్ భవన్‌లో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వ ర్యంలో మహిళలు తమ కాళ్లపై నిలబడేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు గోదావరిఖనిలో 400మంది మహిళలు నేర్చుకుని స్వయం ఉపాధి పొందార తెలిపారు. గోదావరిఖనిలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రాంత సేవా ప్రముఖ్ కోమళ్ల రాజేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, మాతృశక్తి సంయోజక్ భవాని, కుట్టు శిక్షణ నిర్వాహ కులు ఆరెల్లి మమత, మహిళలు వీణ, మం జుల, దీప్తి, సుమ, కీర్తన, స్రవంతి, నవ్య, స్వాతి, శ్రీనిధి, మానస పాల్గొన్నారు.

అద్దె భవనంలో ఎంపీడీవో కార్యాలయం

- అరకొర వసతులతో ఉద్యోగులు, ప్రజల ఇబ్బందులు
- మూత్రశాలలు లేక కష్టాలు
- ఇబ్బంది పడుతున్న మహిళా ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం పాత భవన స్థలాన్ని ప్రభుత్వం బస్ డిపోకు కేటాయించడంతో నూతనంగా ఎంపీడీవో కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్నారు. అయితే అద్దెకు తీసుకున్న భవనంలో ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు కార్యాలయంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఆందోళన చెందుతున్నారు. మహిళ ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే మహిళలకు సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం లేకపోవడంతో మండలంలోని గ్రామాల్లో ఉన్న రైతువేదికల్లో సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయం 30 గ్రామ పంచాయతీలకు బిందువుగా ఉన్న వసతులు లేవని ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే వారికి వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కొత్తపల్లి వాసికి డాక్టరేట్



సంపత్‌కుమార్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చిలారపు సంపత్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఎవాల్యుషన్ ఆఫ్ యాంటి డయాబెటిక్ ఆక్టివిటీస్ ఆఫ్ ఐసోలేటెడ్ ఫ్యాక్షన్ ఆఫ్ సామ్ ఇండి యన్ మెడిసినల్ ప్లాంట్స్ అనే అంశంపై పరి శోధన చేసినందుకు అన్నమలై యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పిహెచ్‌డి పట్టా పొందారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు డాక్టరేట్ పట్టా పొందడంపై గ్రామస్థులు సంపత్‌కుమార్‌ను అభినందించారు.

అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీ హర్ష విజిలెన్స్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు. అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ పీడీ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ

సుల్తానాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో మంగళవారం వాసవి క్లబ్, వనిత క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాస్త్రీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. క్లబ్ గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా ఆయన సుల్తానాబాద్‌ను సందర్శించారు. క్లబ్ ఆదాయ వ్యయాల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం వారు శాస్త్రీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో నోటు బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు పంపిణీ చేశారు. గవర్నర్ ఇల్లందుల కిషోర్ కుమార్, లింగమూర్తి, యాంసాని రమాదేవి, వాణి, సత్యనారాయణ, పీఎస్‌టీలు సౌమ్య, అలేఖ్య, సంధ్య, హరీష్, వంశీ, రమేష్, పి రమేష్, వాణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): రామగుండం ఆర్‌పీఎఫ్ సీఐగా పని చేసి ఖమ్మంకు బదిలీపై వెళ్లిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ బుర్ర సురేష్ గౌడ్ జన్మదిన వేడుకలను మిత్రబృందం నిర్వహించారు. కుందనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఎండి లీయాఖత్ హైమద్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్, ఎండి ఖలీల్, ఎస్‌కే ముంతాజ్ హైమద్, ఠాకూర్ బల్వాన్ సింగ్ పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలేవి

ముత్తారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలు ఘటనల్లో అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు రైతులు, ప్రజలను లంచాల పేరుతో వేధిస్తున్నారని విమర్శించారు. లంచాలు తీసుకున్నా, కోర్టులకు వెళ్లి మళ్లీ ఉద్యోగాలు చేస్తున్నారని, అలాంటి వారిని డిస్మిస్ చేసేలా చట్టాలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాఘవ పూర్ ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. అంబేద్కర్ సంఘం నాయకులు పలుమార్లు తెలిపిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోని అంబేద్కర్ విగ్రహాన్ని చీకటి నుండి విముక్తి చేయాలని పలువురు నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్జీ-2 ఆధ్వర్యంలో సింగరేణి స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అబ్దుల్‌కలాం స్టేడియంలో జీఎం బండి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా హాజరైన ఆరు జట్ల క్రీడాకారులను జీఎం పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల వలన మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ప్రతి ఉద్యోగి ఏదైన క్రీడలో ప్రావీణ్యం సాధించాలని జీఎం పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ఉద్యోగులతోనే సంస్థ అభివృద్ధి సాధ్యమని జీఎం అన్నారు. డబ్ల్యూపీఎస్ చీఫ్ కోఆర్డినేటర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అధికారులు చంద్రశేఖర్, రాంరెడ్డి, ఉదయ్‌హరిజన్, సంతోష్‌కుమార్, సాధన్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎల్‌పీలో సీఐటీయూ గేట్ మీటింగ్



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఎఎల్‌పిలో మంగళవారం సిఐటియు గేట్‌మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్మికునుద్దేశించి మాట్లాడారు. అన్‌ఫిట్ కార్మికుల విషయంలో సింగరేణి యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆరోపించారు. స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ పేర పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్‌లపై సింగరేణి సంస్థ స్పందించని పక్షంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్, కొంరయ్య, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అహ్మద్‌పాషా, విజేందర్‌రెడ్డి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



పోతనకాలనీలో వాకింగ్ ట్రాక్ ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోతనకాలనీలో వాకింగ్ ట్రాక్‌ను మంగళవారం జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు. అనంతరం నూతన కమ్యూనిటీహాల్‌లో కేర్ టేకర్, రెస్ట్ షెల్టర్‌లను ప్రారంభించారు. బంగ్లాస్ ఏరియాలో పార్క్‌తోపాటు వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు ధనుంజయ, చంద్రశేఖర్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు పాల్గొన్నారు.



పార్క్‌ను ప్రారంభిస్తున్న జీఎం, సేవా అధ్యక్షురాలు